కథ

# జీవన సరిగమలు

రెండుచింతల భానుమతి

మంజుల బద్ధకంగా కళ్ళు విప్పబోతోంది.

''ఏమేవ్! నా బ్రష్ ఎక్కడుంది? ఇక్కడ్నించి చోటు మార్చద్దన్నానా? ఏ వరండాలోనో తగలేసుంటారు. ఏ కాకో ఎత్తుకుపోవటమో లేకపోతే మన పిల్ల రత్నాలు కింద పడవేయుటమో చేసుంటారు'' అని కేకలు పెట్టాడు సుబ్బారావు.

''అబ్బా! అక్కడే ఉంటుంది వెతుక్కోండి. నా పనులతోనే ఛస్తుంటే ఇంకా ఇదో సంత-నేనిప్పుడు రాలేను'' అంటూ విసుక్కుంది వసుధ.

''అబ్బా! పొద్దున్నే సుప్రభాతం మొదలు. ఈ ఇంట్లో ప్రశాంతత అనేది ఎప్పటికైనా వస్తుందా'' అని విసుక్కుంటూ లేచింది మంజుల.

''ఒసేయ్, నా తుండుగుడ్డ, నేను వేసుకోవాల్సిన బట్టలు కనిపించి ఏడవ్వేం? నీకు లక్షసార్లు చెప్పాను. నా బట్టలు ఎవ్వరూ ముట్టుకోవటానికి వీల్లేదని. నేనొక్కడ్నే ఈ ఇంట్లో డిసిప్లిన్డ్‌గా ఏడ్చేవాణ్ణి. నా వస్తువుల జోలికి వస్తే ఊరుకునేది లేదు'' అని కస్సుమన్నాడు సుబ్బారావు.

''చూడండి. మీ రామాయణం వినటానికి ఎవ్వరూ సిద్ధంగా లేరు. పనిమనిషిని, వంట మనిషిని అన్నీ నేనే. ఈ ఇంటెడు చాకిరీ చెయ్యలేక ఛస్తున్నాను. ఇటు పుల్ల తీసి అటు పెట్టే నాథుడు లేడు. రోజల్లా వండి వార్చటంతోనే సరిపోతోంది. వంట పని, ఇంటి పనితోనే సరిపోతోంది. అన్నీ నా ఒక్కదాని వల్ల కావటం లేదు. మీ పెద్దకూతురు ఏమీ పట్టనట్టు ఉంటుంది. ఇక రెండోది, మూడోవాడు సరేసరి. రోజల్లా కొట్టుకోవటంతోనే సరి. నేను ఎవ్వరి కంప్లెయింటులూ వినడానికి సిద్ధంగా లేను. పొద్దున్నే టిఫిన్ కాఫీతోపాటు వంట కూడా అవ్వాలి. నా నడ్డి విరిగిపోతోంది. ఎవరికి కావలసినవి వాళ్ళు జాగ్రత్త పెట్టుకోండి. నా వల్ల కాదు'' అంటూ పెద్ద దండకం చదివినట్టు అరిచింది వసుధ.

''ఏమే కోడలా, ఎక్కడున్నారర్రా? నా మొహాన కొంచెం కాఫీ చుక్క పొయ్యండే..నేనొక పెద్దదాన్ని ఇంట్లో ఏడ్చాననీ, నా అతీ గతీ పట్టించుకోవాల్సింది మీరేనని కొంచెం ఇంగితం కూడా మీకు లేదు'' అంటూ రుసరుసలాడింది సుబ్బారావు తల్లి.

''అబ్బబ్బబ్బా, వాళ్ళ మటుకు వాళ్ళు, ఈ ముసల్దిమటుకు ముసల్ది-



## కాకతాళీయం

**సినిమాల్లో జరిగే కొన్ని సీన్స్ ఒక్కోసారి నిత్యజీవితంలో ఎదురవుతుంటాయి. కాకతాళీయంగా చోటుచేసుకునే ఈ సంఘటనలు తారల జీవనసరళిని ప్రభావితం చేస్తాయి. మొన్నామధ్య సమీరారెడ్డికి ఇలాంటి సంఘటనే ఎదురయ్యింది. భారీ వర్షాలతో సతమతమవుతున్న ముంబై వాసులు ఎక్కడికెళ్లాలన్నా చాలా ఆలస్యం అవుతోంది. ఆ టైంలోనే బ్యాంకాక్‌కి వెళ్లాల్సిన ఈ భామ ఎయిర్‌పోర్ట్‌కి వెళుతుంటే ఓ పాప ప్రమాదానికి గురైంది. అంతే వెంటనే ఆమెని కాపాడి తీరిగ్గా ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లిందిట. కానీ ఆమె వెళ్లాల్సిన ఫ్లయిట్ క్యాన్సిల్ కావడంతో ఊపిరిపీల్చుకుందిట.**

కాల్చుకు తింటున్నారు. కాసేపు కూడా ఇంట్లో ప్రశాంతంగా బతకనిచ్చేటట్టు లేరు'' అనుకుంటూ పక్క దిగి విస విసా బాత్ రూమ్‌లోకి వెళ్ళింది మంజుల.

తయారయి వచ్చేసరికి-

''ఏయ్ రమా, నా పెన్ను తియ్యద్దన్నానా? మళ్ళీ ఇవ్వాళ్ళ నా పెన్ను కన్పించటం లేదు. మర్యాదగా నా పెన్ను నాకిచ్చెయ్'' అని అరిచాడు మంజుల తమ్ముడు భార్గవ.

''పోరా. నా పెన్నులో రీఫిల్ అయిపోయింది. అయినా ఈ పెన్ను మీద నీ పేరేమన్నా రాసుందా? నాకివాళ పరీక్ష ఉంది. త్వరగా వెళ్ళాలి. నువ్వెలాగూ అమ్మకూచివి; కాకా పట్టి ఇంకో పెన్ను కొనుక్కో. ఇది నాకు కావాలి'' అంది రమ.

''చంపేస్తా! నా పెన్నివ్వకపోతే'' అంటూ రమ జడ పట్టుకున్నాడు భార్గవ. చటుక్కున చేతి మీద ఫాట్ మని ఒకటి కొట్టి పారిపోయింది రమ.

''ఛీ... వెధవది. రోజూ ఇంట్లో రామ రావణ యుద్ధమే. ఈ ఇల్లు వదలి ఎక్కడికైనా ఎవ్వరూ లేని చోటికి పారిపోతే ఎంత బావుంటుందో'' అనుకుంటూ చుర చుర లాడుతూ డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చి గబ గబా ఉప్మా నోట్లో కుక్కుకుని టిఫిన్ డబ్బా పుచ్చుకుని బ్యాంక్‌కి హడావుడిగా బయల్దేరింది మంజుల.

ఆఫీసుకి వచ్చి సీట్లో చేరబడగానే, పక్క సెక్షన్‌లో అనిత రాధతో అంటోంది ''ఏవండీ, కొత్త కాపురం ఎలా ఉంది? నాకు పెళ్ళయి మూడు నెలలు అయిందిగాని ఒక ముద్దు ముచ్చట లేదు. మా అత్తగారు ప్రతి దాంట్లో కలుగజేసుకుంటుంది. బయటకు వెళ్ళాలన్నా ఆవిడ పర్మిషన్ లేకుండా కదలటానికి వీల్లేదు. వంట ఆవిడే చెయ్యాలి. వడ్డన ఆవిడే చెయ్యాలి. నన్ను ఛస్తే వంటింట్లోకి రానివ్వదు. అది ఆవిడ సామ్రాజ్యం అనుకుంటుంది. తెగ చికాకు వేస్తోంది. మీ కాపురం ఎలా సాగుతోంది?''

''నాకు అలాంటి గొడవలేం లేవండి. మా అత్తగారు మామగారు మా దగ్గర ఉండరు. ప్రస్తుతానికి హాయిగానే ఉన్నాం'' అంది రాధ.



వీళ్ళ సంభాషణ విన్న మంజులకి చిర్రెత్తుకొచ్చింది. 'అబ్బ ఇక్కడ కూడా వీళ్ళకి ఇంటి గొడవే! హాయిగా ఆఫీసులోనయినా మనశ్శాంతితో ఉండలేరుగదా!' అనుకుంది. ఇంతలో తన సెక్షన్‌లో పనిచేసే అన్నపూర్ణ లెడ్జర్ అందిస్తూ ఏదో చెప్పబోయి..ఆగిపోయి తన సీట్లోకి వెళ్ళిపోయింది.

'మంచివేళ. ఈవిడ ఇంకే భాగవతం విప్పబోయిందో! బతికిపోయాను. అయినా వాళ్ళ వాళ్ళ సమస్యలు పక్క వాళ్ళకు చెప్పుకోవాలనే కోరిక ఏమిటో' అనుకుంది మంజుల.

లంచ్ అవర్‌లో అడ్వాన్సెస్ సెక్షన్‌లో పనిచేసే మధుసూదన్ ఎవరో కొత్తమొహాన్ని పరిచయం చేస్తూ మంజుల దగ్గరికి వచ్చాడు.

''ఇతని పేరు శ్రీధర్. కొత్తగా మెయిన్ బ్రాంచి నుంచి ట్రాన్స్‌ఫర్ అయి ఇక్కడికొచ్చాడు'' అనంగానే అతను చిరునవ్వుతో విష్ చేశాడు. సమాధానంగా మంజుల ముభావంగా తలూపింది.

వెడుతూ వెడుతూ మధుసూదన్ శ్రీధర్‌తో ''ఈవిడేనండీ ఎమ్ స్క్వేర్- అంటే ముచ్చు మంజుల అన్నమాట'' అని నవ్వటం మంజులకి స్పష్టంగా వినిపించింది.

'ఏమన్నా అనుకొని ఏడవండి. మీలాగా అనవసరమైన విషయాల్లో తలదూర్చటం, మాట్లాడటం నా వల్ల కాని పని' అనుకుంది.

సాయంకాలం అవుతూనే తన పన్లు ఏవీ వదలకుండా అంతా ముగించుకుని ఇంటికి వెళ్ళే దారిలో అలవాటు ప్రకారం, ఎక్కువ జనం లేని ఆంజనేయస్వామి దేవాలయంలో గోడకి చేరగిలబడి 'ఆహా! ఇక్కడ ఎంత బావుంది. ఇంట్లో నాన్న అరుపులు, అమ్మ సాధింపులు, చెల్లి తమ్ముళ్ళ కొట్లాటలు, బామ్మ సణుగుళ్ళు లేకుండా ఎంత బావుందో. అయినా, అమ్మ పొద్దస్తమానం నస పెడుతూనే ఉంటుంది. ఇంటికి వెళ్ళగానే మళ్ళీ టేప్ రికార్డర్ ఆన్ చేస్తుంది. 'ఈ పెళ్ళి ఫోటో ఎలా ఉంది? ఈ అబ్బాయి ఎలా ఉన్నాడు? మీ మావయ్య తెచ్చిన సంబంధం గురించి నీ అభిప్రాయం ఏమిటి?' అంటూ వెంట పడుతుంది. తను ఒక్కసారి గట్టిగా విసుక్కుంటే గప్ చిప్‌గా వెళ్ళిపోతుంది.

ఇక రమ, భార్గవ సరేసరి. తను

వచ్చేదాకా తన గదిలో చదువుకుని గది అంతా చిందరవందర చేసి వెళ్ళిపోతారు. ఒక్కొక్కసారి ఛెడామడా వాళ్ళని వాయించేయాలనిపిస్తుంది. ఇంటికెళ్ళంగానే బామ్మ ఒకత్తి, ఎవన్నా తినేందుకు తీసుకొచ్చావుటే అంటూ ఎన్క్వైరీ చేస్తుంది. ఏవి తీసుకెళ్ళాలి- ముసలిదానికి రోజూ! ఆ కిష్కింధలోకి వెళ్ళాలంటేనే చికాకు. 'అమ్మో! అప్పుడే ఏడయిందా' అని రోజులాగానే అనుకుంటూ ఇంటి దారి పట్టింది.

రోజులు గడిచిపోతున్నాయి. మంజుల గమనిస్తూనే ఉంది. కొత్తగా వచ్చిన శ్రీధర్ అందరితో కలిసిపోవటం, గలగలా మాట్లాడుతూ ఉండటం.

ఒకరోజు-

''ఏమండీ సుబ్బారావుగారూ! ఇల్లు మారుతానన్నారు దొరికిందా?'' శ్రీధర్ ఎంక్వయిరీ.

''లేదండీ శ్రీధర్. దాని గురించే వెతుకున్నా. ఇల్లు కాస్త బావుందనుకుంటే, అద్దె విపరీతంగా అడుగుతున్నారు. పైగా అడ్వాన్సు. ఎలాగో ఏవిటో''

''అయితే మా ప్రక్కవాటా ఖాళీగా ఉంది. అద్దెకూడా రీసనబుల్‌గానే ఉంది. చూసుకుని వెంటనే చేరిపోండి''

''చాలా థాంక్స్ అండీ. ఈరోజు సాయంత్రమే వస్తా''


మరో రోజు-

''ఏవిటండోయ్ నాగేంద్రగారూ! అదోలా ఉన్నారు. ఏవిటి సంగతి? మీ అబ్బాయి అడ్మిషన్ గురించేనా? నా స్నేహితుడు ఒకతను బిషప్ కాటన్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి చెప్పాను. వాళ్ళ ప్రిన్స్‌పాల్‌తో మాట్లాడాడుట. మిమ్మల్ని రేపో ఎల్లుండో ఎప్పుడు వీలైతే అప్పుడు కలుసుకోమన్నాడు.''

ఇంకొక రోజు-

''ఏవండోయ్ అనితగారూ! ఏమిటి అదోలా ఉన్నారు? మీరేమీ అనుకోనంటే ఒక చిన్న సలహా. మీ అత్తగారు ఆఫీసునించి లేటుగా వెడితే ఏమీ అనరు. ఇంటికి వెళ్ళి మళ్ళీ బయటికి వెళ్ళాలంటేనే ప్రాబ్లమ్ అని చెప్పినట్లు గుర్తు. వారానికి ఒకసారో రెండుసార్లో మీరు మీవారూ ఆఫీసు పని త్వరగా ముగించుకుని ఏ రెస్టారెంటుకో వెళ్ళి కాసేపు గడిపి వెళ్ళండి. వెడుతూ వెడుతూ మీ అత్తగారికి నచ్చిన స్వీట్సో, పళ్ళో పట్టికెళ్ళండి. ఆవిడ చేసిన వంటల్ని మెచ్చుకోండి. మిమ్మల్ని వంట చెయ్యనివ్వటల్లేదు అనే కంప్లెయింట్ నించి బయటకు రండి. మీరేదైనా సినిమాకి వెళ్ళానుకున్నప్పుడు ఆవిడని కూడా రమ్మనండి. ఆవిడకి సినిమాలు పెద్దగా ఇష్టముండవని మీరు ఒకసారి అన్నట్టు గుర్తు. మీరు పిలిచారు కదా అని ఒకటి రెండుసార్లు వచ్చినా, ఆటోమేటిక్‌గా ఆవిడ మానేసి మిమ్మల్ని వెళ్ళిరమ్మనచ్చు. ఆవిడ గురించి మీకే బాగా తెలుసు కాబట్టి ఏది బాగా వర్కవుటవుతుందో చూసుకోండి.''

ఇలా జరుగుతూ ఉండేవి.



శ్రీధర్ అలా అందరితో మాట్లాడుతూ ఉంటే మంజులకి అదంతా ఒక నటనలాగా కనిపించేది. అందరి దగ్గరా తనో హీరోలా కన్పించాలని చేసే ప్రయత్నంలా అనిపించేది. ఏదో చిన్న హెల్ప్ లాంటిది చేసి అందరి దగ్గర్నించి ఇంప్రెషన్ కొట్టేయటానికి గురుడు చాలా ప్రయత్నాలు చేస్తున్నాడు. అనే భావనతో ఉండి, అతను దగ్గరికి వచ్చినప్పుడల్లా ఏదో ఒక వంకతో పక్కకు తప్పుకుని వెళ్ళిపోతూ ఉండేది.

ఒకరోజు పేమెంట్ క్యాషియర్ రాకపోవటంతో మంజుల క్యాష్ కౌంటర్‌లో కూర్చోవలసి వచ్చింది. సుమారు పదకొండు గంటలకి 50 వేల రూపాయలకి ఒక చెక్కు పాసయి వచ్చింది. చేతిలో ఉన్న క్యాష్ సరిపోకపోవటంతో, కేబిన్‌లోంచి బయటికి వచ్చి క్యాష్ ఆఫీసర్ సురేష్ దగ్గరికి వెళ్ళి క్యాష్ కావాలని అడిగింది. ఒకసారి ఆశ్చర్యంగా మంజుల వంక చూసి, ''అదేవిటంటీ పొద్దున రెండు లక్షలు ఇచ్చాను. మీరింతవరకూ చేసిన పేమెంట్స్ అన్నీ కలిపినా లక్ష రూపాయలు కావు. మరి క్యాష్ ఎందుకు?'' అన్నాడు. ఈసారి ఆశ్చర్యపోవటం మంజుల వంతయింది. గబగబా కేబిన్‌కి వెళ్ళి పేమెంట్ అయిన చెక్కులన్నీ తీసి ఒక్కొక్క దాని వెనకాల రాసిన డినామినేషన్ వివరాలు చూడటం మొదలుపెట్టింది. డబ్బు పే చేసేటప్పుడు, ఏఏ డినామినేషన్ నోట్లు ఎన్నెన్ని ఇస్తున్నారో చెక్కుల వెనకాల రాయటం పద్ధతి. అలా చూస్తూ ఉండగా, సేవింగ్ అకౌంటు నెంబరు 361 గల కస్టమరు ఇచ్చిన చెక్కు వెన

## ఐశ్వర్య బాధ

**అందాలపోటీలనుంచి అంతర్జాతీయ చిత్రాల వరకూ తన ప్రస్థానాన్ని సాగించిన ఐశ్వర్యారాయ్ ఈమధ్య కొంచెం డల్‌గా ఉన్నట్టు కన్పిస్తోంది. ఈమధ్య సల్మాన్‌ఖాన్, ఐశ్వర్యారాయ్‌ల మధ్య జరిగిన సంభాషణ టేప్‌లు బహిర్గతం కావడంతో ఆమె జనం ముందుకి రాలేకపోయింది. ఇప్పుడామె మాట్లాడుతూ 'ఇండస్ట్రీలో హీరోల డామినేషన్ ఎక్కువైపోయింది. నేనేమీ మట్లాడలేకపోతున్నా. పాత జ్ఞాపకాల్ని నెమరువేసుకోవడానికి అవేమీ మంచివి కాదుగా' అంటోంది. అన్నట్టు అప్పటికీ ఇప్పటికీ ఐశ్వర్యారాయ్ కాస్త అందంగానే ఉందంటున్నారంతా.**

కాల వంద రూపాయల డినామినేషన్ నోట్లు వెయ్యి ఇచ్చినట్లు రాసి ఉన్నది. ముందు వైపు తిప్పి చూస్తే చెక్కు పదివేలకి రాసుంది. అంటే పది వేలు పేమెంట్ చెయ్యడానికి బదులు లక్ష రూపాయలు చేసిందన్నమాట. విషయం అర్థమవగానే మంజులకి చెమటలు పట్టేశాయి.

5 రూపాయలయినా, పదులయినా, వందలైనా, ఏ డినామినేషన్ అయినా 100 నోట్లు అవంగానే ఒక ప్యాకెట్‌గా తయారుచేస్తారు. అటువంటి 10 ప్యాకెట్లు కలిపి ఒక కట్టగా కడతారు. దాన్ని బండిల్ అంటారు. అంటే పదివేల చెక్కు పేమెంటు చేయటానికి ఒక ప్యాకెట్ ఇవ్వడానికి బదులు ఒక బండిల్ ఇచ్చేసిందన్నమాట. ఫలితంగా 90 వేల రూపాయల షార్టేజీ. విషయం పూర్తిగా అర్థం అవగానే మంజుల ఏడవటం మొదలుపెట్టింది. అది గమనించిన స్టాఫ్ అంతా మంజులని మాటలతో ఓదార్చటానికి ప్రయత్నించారు.

శ్రీధర్ ముందుకొచ్చి చెక్కు వివరాలు చూసి,

''ఈ కస్టమర్ బాగా తెలిసిన వాళ్ళు ఎవరైనా ఉన్నారా?'' అని అడగ్గానే, ''నాకు బాగా తెలుసండీ. రాఘవరావు అని చాలా పాత కస్టమర్'' అన్నాడు మాధవరావు.

''అయితే వెంటనే పదండి వెడదాం'' అంటూ పార్కింగ్‌లో పెట్టిన తన స్కూటర్ దగ్గరికి పరిగెత్తాడు. స్టాఫ్ అంతా తమ తమ సీట్ల దగ్గరికి వెళ్ళిపోయారు కస్టమర్లని అటెండ్ అవటానికి.

మంజుల మనసులో 90 వేల రూపాయలు ఎక్కడ్నించి తెచ్చికట్టటమా అనే విషయమే తొలిచేస్తోంది.

చాలామందికి తెలియదు- బ్యాంకులో క్యాషియరు పొరపాటున ఎక్కువ డబ్బిచ్చేస్తే ఆ లోటు ఆ క్యాషియర్ చేతినించి వేసుకుని భర్తీ చెయ్యాలని. బ్యాంకే భరిస్తుందనుకుంటారు. ఆ కారణంగానే ఎక్కువ ఇచ్చిన మొత్తాన్ని తిరిగి ఇవ్వకుండా తీసికెళ్ళిపోతారు.

'శ్రీధరూ, మాధవరావూ వెళ్ళారే గానీ, ఆ కస్టమరు డబ్బు తిరిగి ఇస్తాడా' అని ఆలోచిస్తోంది మంజుల. ఆమెకు నమ్మకం లేదు.

సుమారు ఒక గంట టెన్షన్ తర్వాత శ్రీధర్, మాధవరావులు తిరిగొచ్చారు.

''మంజులగారూ! మీరు పార్టీ ఇవ్వాలి'' అన్న శ్రీధర్ మాటలు వినగానే మంజుల ఒక్కసారి ఊపిరి పీల్చుకుంది. స్టాఫ్ అంతా మంజులని అభినందించారు.


''శ్రీధర్‌గారి చాకచక్యంతో మన డబ్బు తిరిగొచ్చిందండీ'' మాధవరావు వివరిస్తున్నాడు. ''మొదట వాళ్ళకి పది వేలే ముట్టాయని, గట్టిగా చెప్పారు. ఎక్కువ ఇచ్చిన 90 వేల రూపాయలు బ్యాంకి భరించదు; ఉద్యోగి దగ్గర్నించి వసూలు చేస్తారని చాలా చక్కగా వివరించి, లక్ష రూపాయలు ఇచ్చినట్టు తగిన సాక్ష్యాలు వున్నాయని, పోలీసుల దాకా వెడితే వ్యవహారం రసాభాస అవుతుందనీ శ్రీధర్‌గారు సామ దాన భేద దండాలు ఉపయోగించేసరికి, పది వేలే ముట్టాయని సరదాగా ఆట పట్టించటానికి అన్నానని అంటూ 90 వేలూ ఇచ్చేశారు. మొత్తానికి శ్రీధర్ గార్ని మెచ్చుకోవాలి''

ఈ మాటలు విన్న మంజుల శ్రీధర్ వంక కృతజ్ఞతా భావంతో చూస్తూ నమస్కరించింది. అతని మీద తను ఏర్పరుచుకున్న తప్పుడు అభిప్రాయానికి సిగ్గుపడి, మంచితనాన్ని గుర్తించలేని తన చిన్న మనసును తిట్టుకుంది.

★ ★ ★

అలవాటు ప్రకారం ఒకరోజు సాయంత్రం ఆంజనేయస్వామి గుళ్ళో కూర్చుని ఉండగా, ఎవరో పిలిచినట్టయి తల తిప్పి చూసింది మంజుల.

''ఏవండోయ్ మంజులగారూ! ఏమిటి ఇవాళ ఇక్కడున్నారు?'' అంటూ శ్రీధర్ దగ్గరకొచ్చాడు. శ్రీధర్‌ని చూడగానే మంజుల మొహం విప్పారింది.



''భలేవారే. ఇది నేను రోజూ వచ్చే చోటే'' అంటూ చిరునవ్వుతో కొంచెం జరిగి అతనికి కూర్చోటానికి చోటిచ్చింది.

''రోజూ వస్తారా! ఎందుకు? మీకు ఆంజనేస్వామి అంటే అంత భక్తా?'' అని అడిగాడు.

''భక్తి కాదు. చికాకు నుంచి తప్పించుకోటానికి, మనశ్శాంతికోసం ఇక్కడికొస్తూంటాను'' అంటూ మంజుల తన ఇంటి విషయాలు చూచాయగా చెప్పింది.

అంతా విని, ''మీరు ఏమీ అనుకోకపోతే ఒక మాట చెప్తాను'' అన్నాడు శ్రీధర్.

''భలేవారే, చెప్పండి, ఏవీ అనుకోను'' అన్నది మంజుల. ఇప్పుడు మంజుల దృష్టిలో శ్రీధర్ పట్ల గౌరవం ఉన్నది.

చెప్పటం మొదలుపెట్టాడు శ్రీధర్- ''నేను తప్పో రైటో తెలియదుగానీ, ప్రశాంతత అనేది మన మనసు తాలూకు స్థితిని బట్టి ఉంటుంది.

## తప్పక చూడాల్సింది!

**తారల నిజజీవితాన్ని మించిన కథ సినిమాకి ఇంకేం ఉంటుంది. అందుకేనేమో చాలామంది నిర్మాత, దర్శకులు నిజజీవిత గాథల్ని తమ చిత్రాలకు ఇతివృత్తాలుగా ఎంచుకుంటూ ఉంటారు. సంచలన నటుడు సల్మాన్‌ఖాన్ తన జీవితగాథని 'మేరీ లవ్ స్టోరీ' పేరుతో రాసిన కథని సినిమాకి ఇతివృత్తంగా ఎంచుకున్నాడు. తానే స్వయంగా రాసిన ఈ కథకి సమీర్‌కార్నిక్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో ఎలాంటి సంచలన దృశ్యాలుంటాయో చూడాలి మరి!**

మనసు ప్రశాంతంగా ఉందనుకోండి, బయట ఎంత గోలగా ఉన్నా మనం హాయిగా ఉంటాం. మనసు అల్లకల్లోలంగా ఉంటే ఆలోచనలు కందిరీగల్లా చుట్టుముట్టి, మన చుట్టూ వాతావరణం ఎంత ప్రశాంతంగా ఉన్నా మనం సుఖంగా ఉండలేం. మీరు పరిస్థితులను ఎదుర్కోవటానికి బదులు, వాటి నుంచి పారిపోయి మనశ్శాంతి కోసం బయట వెతుక్కుంటున్నట్టు అనిపిస్తోంది. మనం చాలా మటుకు మన చుట్టూ ఉన్న వారి పరిస్థితి గమనించకుండా మనకు తగ్గట్టుగా పక్కవాళ్ళు నడుచుకోవటంలేదని అనుకుంటాం. మనం వాళ్ళ వైపునించి ఆలోచించి వాళ్ళకేం కావాలో అందించకుండా, వాళ్ళు మనకి అనుగుణంగా లేరని చికాకు పడతాం. ఒక్క క్షణం వాళ్ళవైపు వెళ్ళి వాళ్ళకేది ఆనందం

కలిగిస్తుందో ఆలోచించి వీలైనంత చెయ్యగలిగితే ఆటోమేటిక్‌గా వాళ్ళు సుఖంగా ఉంటారు. మనమూ హాయిగా ఉండగలుగుతాం.

మిమ్మల్ని ఆఫీసులో చూస్తాను. అదొక రకంగా అందరికీ దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తాంటారు. మిగిలిన స్టాఫ్ మెంబర్స్ తమ సమస్యలని మీతో చెప్పటానికి సందేహిస్తారు. ఎందుకంటే మీరు మీ సమస్యలను వాళ్ళతో చర్చించరు. వాళ్ళ సమస్యల పట్ల ఇంట్రెస్టు చూపించరు. కొంతమందికి సమస్యలు చెప్పుకోవటానికి ఒక అవుట్ లెట్ కావాలి. మరికొంతమంది తమ సమస్యలని మరొకరికి చెప్తే పరిష్కారం దొరుకుతుందని నమ్ముతారు. వాళ్ళ సమస్యల్ని విని మనకి చేతనయినంత సహాయం చేస్తే మనకి కూడా చాలా తృప్తిగా ఉంటుంది. ఏదీ చెయ్యలేకపోతే కనీసం విని సానుభూతి చూపించినా చాలు. వాళ్ళకి తృప్తిగా ఉంటుంది. చొరవ తీసుకుని ఇదంతా చెప్పినందుకు మరేమీ అనుకోకండి. ఎందుకో చెప్పాలనిపించింది. అరె! మాటల్లో పడి చూసుకోలేదు. చాలా టైమయిందే. మిమ్మల్ని మీ ఇంటి దగ్గర డ్రాప్ చెయ్యనా?'' అన్నాడు శ్రీధర్.

''అక్కరలేదండీ. మా ఇల్లు దగ్గరే. వెడతాను. మీరు వెళ్ళిరండి'' అంది మంజుల.

దారి వెంట వెడుతూ, ఇంటికెళ్ళిం తరువాత కూడా మంజుల- శ్రీధర్ అన్న మాటల గురించే ఆలోచిస్తూ ఉండిపోయింది. మంజుల చిర్రుబుర్రులాడకుండా పరధ్యానంగా ఉండటాన్ని ఇంట్లో అందరూ ఆశ్చర్యంగా గమనించారు.

మర్నాడు సాయంత్రం ఆఫీసునించి వస్తూ బజారుకెళ్ళి టూత్ బ్రష్‌లు పెట్టుకునే ప్లాస్టిక్ డబ్బా, కొన్ని హుక్స్, ప్లాస్టిక్ తాడు కొని, బామ్మకి కాసిని పళ్ళు కొన్నది. ఇంటికెళ్ళి దగ్గర్లో ఉన్న ఒక కార్పెంటర్ చేత నాన్న టూత్ బ్రష్ పెట్టుకోటానికి కొన్న డబ్బాని గోడకి ఏర్పాటు చేయించింది. తువ్వాలు వేసుకోవటానికి ప్లాస్టిక్ తాడు కట్టిచ్చింది. ఒక చిన్న అల్మెరా కూడా ఆర్డరిచ్చింది. తండ్రి బ్రష్, పేస్టులు ఆ డబ్బాలో ఉంచీ, ఆయన తువ్వాలు తాడు మీద వేసి వాటిని ఎవ్వరూ కదిలించరాదని ఇంట్లో వాళ్ళకి చెప్పింది. బామ్మకి పళ్ళు ఇవ్వగానే, ఆవిడ ఆశ్చర్యంగా ఆనందపడింది.

ఆ రాత్రి రమని, భార్గవని దగ్గర కూర్చోబెట్టుకుని వాళ్ళకి కావాల్సినవి తనని అడగమని, కొట్టుకోకూడదని చెప్పింది. ఇల్లు నీట్‌గా ఉంచితే సర్‌ప్రైజ్ బహుమతులు ఇస్తానని చెప్పింది. మర్నాడు ఉదయం రోజూకంటే ముందరే లేచి ఫలహారానికి కావలసినవి రెడీ చేసి, ఆరోజుకి కావలసిన కూరలు తరిగిపెట్టింది. ''అమ్మా రేపట్నించీ ఇల్లు ఊడ్చి తుడవడానికి బట్టలు ఉతకడానికి ఒక పని మనిషిని పెడుతున్నాను. నువ్వు కేవలం అంట్లు తోముకుంటే చాలు'' అని మంజుల అంటూ ఉంటే తల్లి ఆనందంగా చూస్తూ ఉండిపోయింది.

బామ్మ అడక్కముందే ఆవిడకి కాఫీ కలిపి ఇవ్వటంతో ఆవిడ ఆనందంతో ''మా అమ్మే, మా తల్లే'' అని తెగ మెచ్చుకుంది. సాయంత్రం వచ్చేటప్పుడు రమకి, భార్గవ్‌కి చైనీస్ చెక్కర్, కొన్ని కామిక్స్ పట్టుకొచ్చింది.

నెమ్మది నెమ్మదిగా ఆఫీసులో అందరితో నవ్వుతూ మాట్లాడటం చూసి అందరూ కించిత్ ఆశ్చర్యపోయారు.

తరువాత ఏదో రకంగా శ్రీధర్ మంజులను కలుసుకోవటం, రెండుమూడుసార్లు రెస్టారెంట్‌కి వెళ్ళటం జరిగింది. అతనితో కబుర్లాడుతుంటే క్రమంగా అతని అభిప్రాయాలు మంజులకి నచ్చటం మొదలుపెట్టాయి.

★ ★ ★

ఒక ఆదివారం సాయంత్రం కాలింగ్ బెల్ మోగుతుంటే, ''మంజులా! ఎవరో చూడమ్మా'' అని పిలిచాడు తండ్రి సుబ్బారావు.

తలుపుతీసి, ఎదురుగా ఉన్న శ్రీధర్‌ని మరొక పెద్దాయన్ని చూసి ఆశ్చర్యపోయింది. ఇంతలో సుబ్బారావు వచ్చి, ''రారా వెంకటేశం, రావయ్యా శ్రీధర్'' అని పిలుస్తుంటే మరింత ఆశ్చర్యపోయింది.

కాఫీలు తాగడం అవగానే, ''నేనూ వెంకటేశం అలా బయటికి వెళ్ళొస్తాం. మీరు మాట్లాడుతూ ఉండండి'' అని చెప్పి సుబ్బారావు ఆ పెద్దాయన్ను తీసుకుని బయటకెళ్ళిపోయారు.

''మీకు ఇదంతా ఆశ్చర్యంగానూ, అర్థం కాకుండానూ ఉంది కదూ!'' అన్నాడు శ్రీధర్ నవ్వుతూ. ''అసలు సంగతి వినండి. మీ నాన్నగారూ, మా నాన్నగారూ చిన్నప్పట్నించీ స్నేహితులు. మీతో పెళ్ళికి నాకు ప్రపోజలు తెచ్చారు మా నాన్నగారు. మీ గురించి వాకబు చెయ్యగా మీరు ఎవరితోనూ కలవరని తెలిసింది. నా స్వభావానికి విరుద్ధంగా ఉన్నట్లు అనిపించి నేను వెంటనే ఒప్పుకోలేదు. అసలు మిమ్మల్ని దగ్గర్నించి స్టడీ చెయ్యాలనిపించి మీ బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. మీతో మాట్లాడిన తరువాత మీరంటే నాకు ఇష్టం ఏర్పడింది. మీకు నేనంటే ఇష్టమైతే మీ నాన్నగారి ద్వారా చెప్పించండి. మీరు కూడా నాలాగే నా గురించి ఒక అభిప్రాయానికి రావటానికి టైము తీసుకోవచ్చు''

''అక్కర్లేదు. నాకిష్టమే'' అంటూ మంజుల మనోహరంగా నవ్వింది.

☆

## రహస్యం

**అందాలతార ఊర్మిళా మతోండ్కర్ ఆహారం విషయంలో తన ఇష్టానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. నాన్‌వెజ్ అంటే ఎక్కువ ఇష్టపడే ఈ భామ ఎక్కువగా నీరు తాగుతుందిట. కొత్తదనంతో కూడిన చిత్రాలు చేయడం ఇష్టపడే ఊర్మిళ తన ఆహారపుటలవాట్లే తన అందానికి రహస్యం అంటోంది. మళ్లీ మంచి అవకాశాల కోసం ఆమె ఎదురుచూస్తోంది. అన్నట్టు ఊర్మిళ చక్కగా వంటకూడా చేస్తోంది.**

